# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-03-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఆర్థికవృద్ధికి జనాభా పెరగాల్సిన ఆవశ్యకత ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ఉగాది రోజున లక్ష మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందజేస్తామని మంత్రి పి. నారాయణ తెలిపారు.

- రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలను నూతన జిల్లాల ప్రాతిపదికన నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉందని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.

- ఐసీసీ పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ రెండవ సెమీఫైనల్ మ్యాచ్ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ముంబైలో మరికాసేట్లో ప్రారంభం కానుంది.

=====================

నూతన జనాభా నిర్వహణ విధానాన్ని త్వరలో రాష్ట్రంలో తీసుకురానున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శాసన సభలో ఈరోజు ముఖ్యమంత్రి పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీపై మాట్లాడుతూ... ఇప్పటి వరకూ కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇక నుంచి జనాభావృద్ధిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ముసాయిదాను సభ ముందుకు తెచ్చామని.. దీనిపై నెల రోజుల పాటు విస్తృత చర్చ జరగాలని కోరుతున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరునాటికి జనాభా నిర్వహ విధానానికి తుదిరూపం ఇచ్చి ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలో 1.5గా ఉన్న సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్)ను 2.1కు తీసుకువెళ్లాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. మూడో సంతానానికి "పోషణ-శిక్షా-సురక్ష" పేరిట ప్రసవం సమయంలో 25 వేల రూపాయల నగదు ప్రోత్సాహకం ఇవ్వాలని ప్రతిపాదన చేస్తున్నామని చెప్పారు. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గిపోతే పని చేసే వారి సంఖ్య గణనీయంగా పడిపోయి ఆర్థికవృద్ధి మందగిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================

ఉగాది రోజున లక్ష మంది లబ్దిదారులకు టిడ్కో ఇళ్లు అందజేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. శాసనసభలోఈరోజు బడ్జెట్ డిమాండ్స్ పై చేపట్టిన చర్చలో ఆయన మంత్రిత్వ శాఖకు చెందిన వివిధ అంశాలపై మంత్రి నారాయణ వివరణ ఇస్తూ... జూన్ నాటికి టిడ్కో ఇళ్ల ను పూర్తి చేయడంతో పాటు 2028 కల్లా ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించేలా ప్రణాళికాబద్దంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి సలహాలు, సూచనలతో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ప్రజలకు విస్తృతంగా మెరుగైన సేవలు అందిస్తున్నామని అన్నారు. ఈ బడ్జెట్ లో మున్సిపల్ శాఖకు 14,538.68 కోట్ల రూపాయల కేటాయింపులు చేసారని.. గత బడ్జెట్ కంటే ఇది 4.88 శాతం ఎక్కువ అన్నారు. ప్రజలు కోరుకునే తాగునీరు, ఘన-ద్రవ-వ్యర్థాల నిర్వహణ, రోడ్లు, వీధి లైట్లతో పాటు ఇతర అవసరాలను ప్రాధాన్యతాక్రమంలో కల్పిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

రాష్ట్రంలో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి 6 వేల కోట్ల రూపాయలతో పనులు చేపట్టినట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన పెరిగిందని, దీంతో రోజువారీ విద్యుత్ వినియోగం 263 మిలియన్ యూనిట్ల నుంచి 280 మిలియన్ యూనిట్లకు పెరగనుందని అంచనా వేస్తున్నామన్నారు. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఉత్పత్తితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. అలాగే రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, వ్యాపార, పారిశ్రామిక, గృహ అవసరాల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగిందని చెప్పారు. భవిష్యత్‌లో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కొరత లేకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలియజేశారు.

=====================

రాష్ట్రంలో 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. శాసన మండలిలో ఈరోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... ఇప్పటివరకు వివిధ రంగాలలో 6,28,327 ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిరుద్యోగులకు ప్రత్యేక ఆర్థిక భృతి పథకం అమలులో లేదని వెల్లడించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రభుత్వం ముందే ప్రకటించిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉద్యోగాల కల్పనకు చర్యలు వేగవంతం అవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ కృషితో అనేక కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయని, డీఎస్సీ నోటిఫికేషన్, పోలీస్ నియామకాలు వంటి ప్రక్రియల ద్వారా ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు. యువతకు నైపుణ్య గణన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి వివరించారు.

విరామం

=====================

రాష్ట్రంలో ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షల హాల్ టికెట్లు విడుదల అయ్యాయి. "బోర్డ్ ఆఫ్ సెంకడరీ స్కూల్ ఎడ్యుకేషన్" అధికారిక వెబ్‌సైట్, మనమిత్ర వాట్సాప్ నంబరు, పాఠశాల విద్యా శాఖకు చెందిన లీప్ యాప్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. 95523 00009 మనమిత్ర వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే హాల్‌టికెట్లు పొందే అవకాశాన్ని అధికారులు కల్పించారు. 16వ తేదీన ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు ఏప్రిల్ ఒకటి వరకు జరగనున్నాయి.

=====================

స్థానిక సంస్థల స్వావలంబనకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి ఈరోజు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జిల్లా పరిషత్ ఎన్నికలను నూతన జిల్లాల ప్రాతిపదికన నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉందని, అందుకు అనుగుణంగా కసరత్తు జరుగుతోందన్నారు. రహదారుల విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం చెట్లను తొలగించేటపుడు తగిన ప్రత్యామ్నాయాలపై పరిశీలన జరుపుతున్నామన్నారు. భవిష్యత్‌లోనూ చెట్లను, వృక్షాలను సంరక్షించేలా బలమైన చట్టం తీసుకొచ్చేందుకు ఆలోచిస్తున్నామని, ఇది కఠినంగా అమలు చేస్తేనే పచ్చదనానికి భరోసా దొరుకుతుందని పేర్కొన్నారు. అలాగే అటవీ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసేవాటికి, నాటే ప్రతి మొక్కకు జియో ట్యాగ్ వేసే ప్రక్రియ అమలు చేయాలని భావిస్తున్నామని తెలిపారు. నర్సరీల నుండే దీనిని అమలు చేసేలా ఓ ప్రత్యేక వ్యవస్థను తీసుకువస్తామని పవన్ కళ్యాణ్ వివరిస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

=====================

బాణసంచా పేలుళ్ల ఘటనల్లో నిర్వాహకుల ఆస్తులు జప్తు చేసి వాటిని బాధితులకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన బాణసంచా పేలుళ్ల ప్రమాదాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని మంత్రి తెలియజేశారు. శాసనసభలో ఈరోజు ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం సవరణ బిల్లు ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అగ్ని ప్రమాద నివారణ చర్యలకు సంబంధించి చట్టంలో మార్పులు చేస్తున్నామన్నారు. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తులు పెరగడంతో చట్టంలో మార్పులు అనివార్యమయ్యాయని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే భవన ప్రాంగణానికి అనుమతులు రద్దు చేసి చర్యలు తీసుకుంటామని హోం మంత్రి హెచ్చరించారు.

=====================

ప్రధానమంత్రి జన్ ఔషధి కేంద్రం ఆధ్వర్యంలో 8వ జన్ ఔషధీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాలను ఈరోజు నిర్వహించారు. జిల్లాలోని 136 జన ఔషధి కేంద్రాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి తక్కువ ధరలకే మందులను పంపిణీ చేశారు. చక్కెర వ్యాధి, రక్తపోటు (బీపీ) పరీక్షలు నిర్వహించడంతో పాటు రోగులకు అవసరమైన సలహాలు, సూచనలను వైద్యులు అందించారు.

=====================

ఐసీసీ పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ రెండవ సెమీఫైనల్ మ్యాచ్ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మరి కాసేట్లో ప్రారంభం కానుంది. ముంబైలోని వాంఖెడే స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ లో విజయం సాధించిన జట్టు నిన్న తొలి సెమీఫైనల్ లో విజయం సాధించిన న్యూజిలాండ్ జట్టుతో ఫైనల్ మ్యాచ్‌లో టైటిల్ కోసం పోటీ పడనుంది. ఈ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం గుజరాత్‌లోని అహ్మదాబాద్ స్టేడియం వేదికగా జరనుంది.

=====================
=====================